# తేడా

**మనం లంచం ఇచ్చామనుకోండి. పుచ్చుకునేవాడు చల్లగా పుచ్చుకుంటాడు. పుచ్చుకోనివాడు ఒకసారే వద్దంటాడు. ఇంకా ఎక్కువ కావాలనుకునేవారు నాలుగుసార్లు వద్దంటారు.**

"వద్దు, వద్దులే, వొద్దూ, వద్దో" అంటాడు.

ప్రతిసారీ అంతో ఇంతో పెరిగితే వద్దంటూనే తీసుకుంటాడు. ఆ ఊర్లో అలాంటి ఆఫీసర్లు ఇద్దరున్నారు. ఒకరు ఎమ్మార్వోగారు, మరొకరు కమిషనర్ గారు. ఇద్దరు మంచిమిత్రులు. ప్రతి రోజూ పేకాటలోనో, డ్రింకు దగ్గరో ఎక్కడో ఒకచోట కల్సుకుంటుంటారు. వాళ్ళిద్దరూ కూర్చున్నప్పుడు భలే తమాషా విషయాలు బయటకొస్తుంటాయి.

ఒకసారి ఇద్దర్లో ఎవరు చెప్పారోగానీ అవినీతిపరులు మూడురకాలట. మొదటిరకం మేకవర్గం. మేక నీళ్ళు ఎలా తాగుతుంది. చెరువులోకి దిగకుండా బయటేఉండి పెదాలు ఆన్చి గొంతు తడుపుకుంటుంది. నీళ్ళు తాగినట్టే ఉండదు. కానీ తాగుతుంది. లంచం తీసుకున్నట్టే ఉండదుకానీ తీసుకుంటారు. రెండోది గోవు వర్గం. ఆవు నీళ్ళెలా తాగుతుంది. నీళ్ళలో కొంచెం దిగుతుంది. మోకాళ్ళవరకు. తాగేటప్పుడు కూడా కొంచెం చప్పుడు చేస్తుంది. వీళ్ళు అనుకున్న ఫిగరు రానప్పుడు అరుస్తారు. అయితే ఆ అరుపులు లంచంకోసమని అనిపించదు. పని బాగోలేదనో డిసిప్లిన్ తగ్గిందనో- ఏది దొరక్కపోతే టెండూల్కర్ బాగా ఆడలేదనో- ఇలా చప్పుడు చేస్తారు. టార్గెట్ రీచ్‌కాగానే చల్లగైపోతారు.

ఇక మూడోది దున్నపోతు వర్గం. దున్నపోతు నీటిలో దబాల్న పడిపోతుంది. అటు పొర్లుతుంది. ఇటు పొర్లుతుంది. మొత్తం నీటినే కెలకెల చేస్తుంది. వీళ్ళకి తింటే గమ్యం. ఏది తింటున్నారో చూడరు. ఎంత తింటున్నారో చూడరు. ఎవరి దగ్గర తింటున్నారో చూడరు. వీళ్ళు ఏ సంస్థలో పన్జేసినా తర్వాత అదెందుకు పనికిరాదు.

ఎమ్మార్వో, కమిషనర్ ఏ వర్గానికి చెందుతారని అడిగితే, తలోవిధంగా చెబుతారు. కమిషనర్ రెండు ఎమ్మార్వో మూడంటారు. లేదులేదు ఎమ్మార్వో రెండు, కమిషనర్ మూడంటారు. ఏది ఏమైనా అందరూ కలిసి ఒప్పుకున్న నిజం ఒకటుంది. అదేమిటంటే ఇద్దరు కూడా ఒకటి మాత్రం కాదని.



అలాంటి వీళ్ళిద్దరు భూమికి సంబంధించిన ఒక విషయంలో ఇరుక్కున్నారు. మున్సిపాల్టీ స్థలంలో పట్టా ఇవ్వడానికి కమిషనర్ రెకమెండ్ చేశాడు. ఎమ్మార్వో పట్టా ఇచ్చాడు. ఆ పట్టా కూడా ఎవరికిచ్చారు? ఎమ్మెల్యేగారి రికమెండేషన్ మీద ఒక కౌన్సిలర్ కీప్‌కి.

ఆమధ్య జరిగిన ఎలక్షన్సులో కౌన్సిలర్ ఎమ్మెల్యే వర్గం నుండి ప్లేటు ఫిరాయించి అపోజిషన్ వాళ్ళకి సపోర్టు చేసాడు. తను చేయడమేకాకుండా మరో ఆరుగురి కౌన్సిలర్స్ మద్దతు ఇప్పించాడు. దాంతో ఎమ్మెల్యే బలపర్చిన వ్యక్తి ఛైర్మన్‌గా ఓడిపోయాడు. ఎమ్మెల్యే ఊరుకుంటాడా? కౌన్సిలర్ భాగోతాలన్నీ బయటకు తీసాడు. సంపాయించిందంతా ఎక్కడ నుండి ఎలా సంపాయించాడో చెప్పమనండని ఎంక్వయిరీ వేయించారు.

కౌన్సిలర్ బినామీగా తన బావమరిది పేరున చేయించిన కాంట్రాక్టులమీద, రోడ్డు మార్జిన్స్‌లో పెట్టించిన బంకుల మీద- ఇప్పించిన పట్టాలమీద- ఎంక్వయిరీ జరుగుతోంది. మనకో సామెత ఉంది. ముడ్డిమీద తంతే మూతిపళ్ళు రాలినాయని. మూతిపళ్ళు రాలాలంటే ముడ్డిమీద తన్నాలని అర్థం. అలాగే నాయకుల మీద కక్ష తీర్చుకోవడమంటే వాళ్ళకు సాయంజేసిన ఆఫీసర్ల మీద ఎంక్వయిరీ వెయ్యడమన్నమాట. ఆవిధంగా ఇప్పుడు కమిషనర్ మీద, ఎమ్మార్వో మీద ఎంక్వయిరీ నడిచి పట్టాల సంగతి బయటపడింది. అందులో కౌన్సిలర్ కీప్‌కిచ్చిన పట్టా కూడా ఒకటి.

వ్యవహారమేదో గట్టిగా ముదిరిపోయేటట్టుందని గ్రహించిన కమిషనర్ ఎమ్మెల్యే దగ్గరకెళ్ళి ప్రాధేయపడ్డాడు. "సార్! అప్పుడు మీరు చెబితేనేకదా ఆ పట్టా ఇవ్వొచ్చని రికమెండ్ చేసాను. ఇప్పుడు..."

**దీర్ఘాశి విజయభాస్కర్**

కమిషనర్ మాట పూర్తికాకుండానే తోకతొక్కిన తాచులా లేచాడు ఎమ్మెల్యే.

"ఏం మాట్లాడుతావయ్యా నువ్వు. నేను చెప్పినవన్నీ చేసేస్తావా? అలాగైతే ఏది మీ మున్సిపల్ ఆఫీసు మా డ్రైవర్‌గాడికి రాసిచ్చి చూస్తాను. ఇది ప్రజాస్వామ్యం. మేం ప్రజాప్రతినిధులం. ప్రజలు మా దగ్గరకి వస్తారు. అనేకం అడుగుతారు. మేం ఏదీ కాదనం. చెయ్యమనే చెబ్తాం. చెయ్యొచ్చో, చెయ్యకూడదో: ఆలోచించుకొని చెయ్యాల్సిన బాధ్యత నీది. నువు ఇర్రెగ్యులర్ పనులు జేసి నన్నంటావేల! నన్నీ గొడవల్లోకి లాగొద్దు. గెటవుట్" అన్నాడు ఎమ్మెల్యే.

ఎంక్వయిరీ పూర్తయింది. కమిషనర్ మీద, ఎమ్మార్వోమీద యాక్షన్ తీసుకోవాలని రిపోర్టు పంపించారు.

కమిషనర్ మీద ఫైలు హెడ్డాఫీసులో ఉంది. ఎమ్మార్వో ఫైలు కలక్టరాఫీసుకి వచ్చింది.

కమిషనర్ మీద ఏ యాక్షన్ తీసుకోవాలన్నదానిమీద తర్జనభర్జనలు జరిగాయి.

"ఇతన్ని వదిలేస్తే మిగతా కమిషనర్లకి భయముండదని, ఇదే అలవాటైపోతుందని కాబట్టి సస్పెండ్ చేసెయ్యాలని తీర్మానించేసుకున్నారు.

ఎమ్మార్వో మీద తీసుకోవాల్సిన యాక్షన్ గురించి చర్చించి "ఎమ్మార్వో మీద యాక్షన్ తీసుకుంటే డిపార్ట్‌మెంటు పబ్లిక్‌లో చీప్ అయిపోతుందని కాబట్టి ట్రాన్స్‌ఫర్ చేస్తే సరిపోతుందని" నిర్ణయించుకున్నారు.

సస్పెన్షన్ ఆర్డర్ అందుకున్న కమిషనర్ ఇంటికొచ్చి గదిలోకి వెళ్ళి ధడాలున తలుపులేసుకున్నాడు.

ఏదో కీడుశంకించిన కుటుంబ సభ్యులు నెత్తినోరు కొట్టుకుంటూ తలుపుల మీదపడి దబదబ బాదారు. పది నిమిషాల తర్వాత తలుపులు తీసుకొని బయటకొచ్చాడు.

ఇంటిల్లిపాది గదిలోకి వెళ్ళి ఫ్యాను వైపు చూసారు. ఫేనుకి తాడు కట్టలేదు. ఫ్యానుకింద స్టూలులేదు.

అందరిలోను ఒకటే ప్రశ్న. తలుపులెందుకు వేసుకున్నట్టు???

రాజకీయ నాయకుల మాటలిని అడ్డమైన పనులు చేసినందుకు తన చెప్పుతో తన చెంపలు వాయించుకున్నాడు.

అదెవరు చూడకూడదని వేసుకున్నాడు తలుపులు. ●



## గ్లామర్‌తో రాణిస్తున్న శిల్పాశెట్టి

**బాలీవుడ్‌లోనూ**, టాలీవుడ్‌లోనూ శిల్పాశెట్టికి మంచిరోజులు వచ్చాయి. ఆమె అందం ప్రేక్షకలోకాన్ని ఊపేస్తుంది. గ్లామర్ ద్వారా ఒక వెలుగు వెలుగుతున్న ఈ అమ్మాయికి ఫీల్డులో అవకాశాలు పెరుగుతున్నాయి. ఆమెకు ఇరవై ఒకటో శతాబ్దం అచ్చి వచ్చిందని సినిమావాళ్ళు గుసగుసలు పోతున్నారు. గ్లామర్ పాత్రలు కాకుండా నటిగా తనను తాను నిరూపించుకునే పాత్రల్లో నటించే అవకాశం ఈ అమ్మాయికి ఇవ్వరా అని ప్రశ్నించేవారు లేకపోలేదు. కాని ఆమె అందమే అందుకే అడ్డంకి అని కొందరు అంటారు. అందాల తారలకు అందమే అడ్డు అవుతుందా అన్నది ప్రశ్నార్థకం.